www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 15 మే 2023
5
పశ్చిమ గోదావరి



## నేడు ఎంఎల్‌సిగా కవురు ప్రమాణ స్వీకారం

### పాలకొల్లు నుంచి అమరావతికి భారీ ర్యాలీకి సన్నద్ధం



**ప్రజాశక్తి - పాలకొల్లు**

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ శాసనమండలి కార్యాలయంలో ఎంఎల్‌సిగా సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. పాలకొల్లులోని వైసిపి కార్యాలయం నుంచి సోమవారం ఉదయం ఆరు గంటలకు భారీ ఊరేగింపుగా వెళ్లడానికి వైసిపి నేతలు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. పలు కారులతోపాటు స్కూల్ బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్‌కు పదవికి ఇంకా రాజీనామా చేయలేదు. సోమవారం ఆ పదవికి రాజీనామా చేస్తారని సమాచారం.

# పొత్తు పరేషాన్..!



- టిడిపి, జనసేన ఆశావహుల్లో గుబులు
- జనసేనకు కేటాయించే సీట్లపై టిడిపి కేడర్‌లో చర్చ
- రెండు జిల్లాల్లో ఐదు నుంచి ఏడు స్థానాలు జనసేనకు అంటూ ప్రచారం
- టిక్కెట్ రాకపోతే ఏం చేయాలనే ఆలోచనలో ఆశావహులు
- జిల్లా నుంచి పవన్ మళ్లీ పోటీకి దిగేనా అని సర్వత్రా చర్చ

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తు తథ్యమంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో జిల్లాలోని టిడిపి, జనసేన పార్టీల నుంచి ఎంఎల్‌ఎ టిక్కెట్ ఆశిస్తున్న నాయకుల్లో గుబులు మొదలైంది. పొత్తు కుదిరితే తాము ఆశిస్తున్న నియోజకవర్గంలో టిక్కెట్ వస్తుందా, లేదా అనే ఆందోళన నేతల్లో నెలకొంది. దీంతో ఇప్పటి నుంచే తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు పైస్థాయిలో పావులు కదుపుతున్నట్లు సమాచారం. 2024 సాధారణ ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన పొత్తుతోనే ఎన్నికల బరిలోకి దిగుతామని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. తమకు పట్టున్న ప్రాంతాల్లో తమ సత్తా చాటుతామని ప్రకటించారు. జనసేనకు పట్టున్న జిల్లాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి ఒకటి. కాపు సామాజిక తరగతి ఓటర్లు ఈ జిల్లాలో అధికంగా ఉన్నారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు, 2019 ఎన్నికల్లో జనసేన పోటీ చేసినప్పుడు వచ్చిన ఓటింగ్ శాతం అందుకు నిదర్శనం. 2019 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం, పాలకొల్లు వంటి పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు ధీటుగా జనసేన అభ్యర్థులు ఓట్లు సాధించారు. జిల్లాల విభజన జరిగిన తర్వాత ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఐదు లేక ఏడుస్థానాలు జనసేనకు కేటాయించే అవకాశం ఉన్నట్లు ఇరుపార్టీల నాయకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఇప్పటికే టిడిపి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న నాయకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. అదే సమయంలో పలు నియోజకవర్గాల్లో టిక్కెట్ ఆశిస్తున్న జనసేన నాయకులకు ఎదురుదెబ్బ తగలనుంది. జనసేనకు పట్టున్న నియోజకవర్గాల్లో ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, నరసాపురంతోపాటు ఏలూరు, తణుకు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులు బరిలోకి దిగితే టిడిపి నాయకుల పరిస్థితి ఏమిటో అర్థంకాని పరిస్థితి ఉంది. ఉంగుటూరు నియోజకవర్గంలో గతంలో టిడిపి ఎంఎల్‌ఎగా పనిచేసి ప్రస్తుతం ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షునిగా గన్ని వీరాంజనేయులు ఉన్నారు. ఈ సీటు జనసేనకు కేటాయిస్తే గన్ని పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది. తాడేపల్లిగూడెం టిక్కెట్‌ను మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ఆశిస్తున్నారు. ఇది జనసేనకు కేటాయిస్తే టిడిపి నాయకుల నుంచి స్పందన ఏవిధంగా ఉంటుందనే చర్చ సాగుతోంది. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఏలూరు వంటి నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అదే సమయంలో టిక్కెట్‌పై ఆశతో ఐదేళ్లుగా పని చేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు నెలకొన్నాయి. పొత్తులో భాగంగా టిక్కెట్ రాని నాయకులు కొత్త సమస్యలు సృష్టించే ప్రమాదం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టిక్కెట్ రాకపోతే పొత్తులో భాగంగా పోటీ చేసిన అభ్యర్థికి మిగిలిన పార్టీల నాయకులు సహకరిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. పొత్తుపై పవన్‌కల్యాణ్ ప్రకటన తర్వాత ప్రతి గ్రామంలోనూ సీట్ల కేటాయింపుపైనే చర్చలు సాగుతున్నాయి. పవన్‌కల్యాణ్‌కు సిఎం పదవి ఇవ్వాలని కాపు సామాజిక తరగతి పెద్దఎత్తున కోరుతోంది. ఆ పరిస్థితి లేకపోతే పొత్తులో ఉన్న పార్టీలకు ఈ సామాజిక తరగతి అండగా ఉంటుందా అనే లెక్కలు సైతం వేస్తున్నారు.

### జిల్లాలో పవన్ పోటీ చేస్తారా?

గత ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ భీమవరం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఈసారి మళ్లీ భీమవరం నుంచి పోటీకి దిగుతారా అనే చర్చలు సైతం సాగుతున్నాయి. లేకపోతే జిల్లాలో వేరే స్థానం నుంచి పోటీకి దిగుతారా అనే మీమాంస సాగుతోంది. ఇప్పటి వరకూ మాత్రం జిల్లా నుంచి పవన్ పోటీ చేస్తారనే సంకేతాలు జనసేన నుంచి ఎక్కడా వినిపించడం లేదు. సొంత జిల్లా అయినప్పటికీ 2009లో ప్రజారాజ్యం తరపున పాలకొల్లు నుంచి పోటీ చేసిన చిరంజీవి, 2019లో జనసేన నుంచి భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కల్యాణ్, నరసాపురం ఎంపీ స్థానానికి పోటీ చేసిన నాగబాబు జిల్లా నుంచి గెలుపొందలేకపోయారు. దీంతో వచ్చే ఎన్నికల్లో జిల్లా నుంచి పవన్ పోటీకి దిగుతారా అనే సందిగ్ధత కొనసాగుతోంది.

# భానుడి భగభగలు



- రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.
- రోడ్లన్నీ నిర్మానుష్యం
- శీతలపానీయాలకు పెరిగిన గిరాకీ

**ప్రజాశక్తి - ఆచంట**

అకాల వర్షాల అనంతరం భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎండతీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఇక 12 గంటలు దాటేసరికి ఎవరూ ఇంటి గడప దాటి బయటికి రాలేని పరిస్థితి ఉంటోంది. నిత్యం వాహనాలు, జనం రాకపోకలతో కిటకటలాడే రహదారులు, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణానిన తలపిస్తున్నాయి. వ్యాపారులు సైతం మధ్యాహ్నం దుకాణాలు మూసివేసి తిరిగి సాయంత్రం తెరుస్తున్నారు. ఇక వడగాల్పులకు జనం విలవిల్లాడుతున్నారు. మధ్యాహ్నానికే ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతోంది. దీంతో ఆరు బయట పని చేసే కార్మికులు, వివిధ తరగతుల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పగలూ.. రాత్రి అనే తేడా లేకుండా ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ఒక్క క్షణం ఫ్యాను ఆగితే చాలు చెమటతో తడిచిముద్దవుతున్నారు. నాలుగు రోజులుగా జిల్లాలో 40 నుంచి 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు వేడిమిని తట్టుకోలేక తల్లడిల్లుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ నేపథ్యంలో జనం ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రయాణాలు చేస్తున్నారు. మధ్యాహ్నం వేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్లాల్సి వస్తే ముఖానికి వస్త్రం కట్టుకొని, గొడుగులు ఉపయోగించి రాకపోకలు సాగిస్తున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు, కొబ్బరిబొండాలు తీసుకుని వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో శీతల పానీయాలు, కొబ్బరిబొండాల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు కూడా మధ్యాహ్నం వేళ బోసిపోతున్నాయి.



ఆచంటలో నిర్మానుష్యంగా మారిన ఆచంట- కోడేరు ఆర్అండ్‌బి రహదారి

**రెట్టింపైన ఎసిల అమ్మకాలు**

గతేడాదితో పోలిస్తే ఎసిల అమ్మకాలు రెట్టింపయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు. నాలుగైదేళ్ల క్రితం వరకు ఎసిలు సంపన్నుల ఇళ్లకే పరిమితమయ్యాయి. మధ్యతరగతి ప్రజలు కూలర్లు కొనుగోలు చేసుకునేవారు. రెండు, మూడేళ్ల నుంచి ఎసిల అమ్మకాలు గణనీయంగా పెరిగిపోయాయి. ఈ ఏడాదైతే మార్చి నుంచే అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో ఇన్వర్టర్ ఎసిల అమ్మకాలు అనూహ్యంగా పెరిగిపోయాయి. ఎసిలతోపాటు పాటు ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

**పెరిగిన విద్యుత్ కోతలు**

విద్యుత్ కోతలు లేవంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్నా గంటగంటకు నిలిచిపోతున్న విద్యుత్ సరఫరాతో ఆచంట నియోజకవర్గంలోని ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా విద్యుత్ కోతలకు అంతు లేకుండాపోయింది. తెల్లవారకముందే ప్రారంభమవుతున్న విద్యుత్ కోతలతో అన్ని తరగతుల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండుతున్న ఎండలు, ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉక్కపోత నడుమ విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అధికారులను ప్రశ్నిస్తే పైన సమస్య అంటూ తప్పించుకుంటున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఒఆర్ఎస్ నీళ్లు తాగాలి



**డాక్టర్ శివరంజని, గైనకాలజిస్టు,ఆచంట సిహెచ్‌సి**

ఎండల తీవ్రత నేపథ్యంలో ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలి. తరచూ ఒఆర్ఎస్ నీళ్లు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షించుకోవచ్చును. పౌష్టికాహారంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అందువల్ల గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలి.

### ఒఆర్ఎస్ నీళ్లు తాగాలి



**డాక్టర్ దిగుపాటి జితేంద్ర, ఆచంట సిహెచ్‌సి వైద్యాధికారి**

ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తప్పనిసరైతే తప్ప ఎండలో ప్రయాణం చేయవద్దు. ఎండలకు శరీరంలోని ఉష్ణోగ్రత కోల్పోతారు. వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఎక్కడబడితే అక్కడ ఆహారం తీసుకోవద్దు. ఎండలకు ఆహార పదార్థాలు త్వరగా పాడయ్యే ప్రమాదం ఉంది. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల డయేరియా బారిన పడతారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. తరచూ ఒఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షించుకోవచ్చు.

# మాదకద్రవ్యాలకు బానిసలుగా యువత

### నివారణకు ఎస్ఎఫ్ఐ కృషి అభినందనీయం - ఎస్ఐ రమేష్

**ప్రజాశక్తి - వీరవాసరం**

నేటి సమాజంలో యువత పెద్దసంఖ్యలో మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని, దీన్ని నివారించేందుకు ఎస్ఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయమని వీరవాసరం ఎస్ఐ రమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ వీరవాసరం మండల శాఖ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఫెస్ట్-2023 ఆదివారం ప్రారంభమైంది. స్థానిక ఎస్ఎంబిటిఎవి అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ ఫెస్ట్ మొదటి రోజు 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో అల్లూరి సీతారామరాజు స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ రమేష్, ప్రిన్సిపల్ వి.నరసింహరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగాన్ని నేటి సమాజంలో యువత సర్వసాధారణంగా భావిస్తూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. దీన్ని విడనాడాల్సిన అవసరం ఎంతో ఉందని, అది వారికి వ్యక్తిగతంగా.. ఆ కుటుంబానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలే సమాజంలో పెద్ద సమస్యగా మారాయన్నారు. నేడు చోటుచేసుకుంటున్న అనేక నేరాలకు ఈ మత్తు పదార్థాలే మూలమని చెప్పారు. వీటి నివారణకు పోలీసు శాఖ నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. తమ కృషికి విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు, మండల నాయకులు పి.శ్రీకాంత్, కె.నారాయణ, పి.బాలాజీ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఫెస్ట్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్

# ఉదయం మంచు.. మధ్యాహ్నం మండుటెండ

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లులో ఉదయం మంచు దుప్పటి పరచుకోగా మధ్యాహ్నం మండుటెండ దారెత్తించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మే నెలలో మంచు ప్రభావం ఆదివారం తెల్లవారుజామున ఎక్కువగా ఉండటం గమనార్హం. దీంతో జనం విస్మయానికి గురవుతూనే చల్లదనంతో సేదదీరారు. అయితే ఉదయం పది గంటల తర్వాత ఎండ ప్రభావం యథాతథంగా పెరిగింది. దీంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులతోపాటు సామాన్య ప్రజానీకం రోడ్డుపై రావడానికి జంకుతున్నారు. ఓపక్క వివాహ వేడుకలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎసి వాహనాల్లోనూ జనం ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎండ తీవ్రతకు మోటార్ సైకిల్‌పైనా బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.



పాలకొల్లులో ఉదయం కురుస్తున్న మంచు



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

# బీచ్‌లో పర్యాటకుల సందడి

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. వేసవి సెలవుల నేపథ్యంలో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు సముద్ర స్నానాలు చేసి సేదతీరారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఈ ఆదివారం బీచ్‌కు జనం రాక పెరిగింది. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివి, కొబ్బరి తోటల్లో ఉల్లాసంగా గడిపారు.

# సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాల్లో హర్షిత్ ప్రతిభ

### జిల్లాస్థాయిలో సెకండ్ ర్యాంకు



**ప్రజాశక్తి - ఏలూరు**


సిబిఎస్ఇ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏలూరు నగరానికి చెందిన విద్యార్థి వర్ధినీడి హర్షిత్ గంగాధర్ జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు. పెదవేగిలోని నవోదయలో పదో తరగతి చదివిన హర్షిత్‌కు 600 మార్కులకుగాను 564 మార్కులు సాధించి జిల్లా సెకండ్ ర్యాంకు సాధించారు. హర్షిత్ ప్రతిభపై అతని తల్లిదండ్రులు వర్ధినీడి సత్య, వీరవెంకట నాగేంద్ర ప్రసాద్‌తోపాటు పెదవేగి నవోదయ స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపారు. హర్షిత్ తల్లిదండ్రులు ఏలూరు ఆర్ఆర్‌పేటలోని ఆర్ఎంఎస్ కాలనీలో నివశిస్తున్నారు. ప్రసాద్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తూ సిపిఐయు, సిపిఎంల్లో పలు బాధ్యతల్లో ఉంటూ వివిధ రంగాల ప్రజల సమస్యలపై పని చేస్తూ ఉంటారు. ఈ సందర్భంగా హర్షిత్ గంగాధర్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ అభినందించారు.

# హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలి

### 104 ఎంఎంయు నూతన అధ్యక్షుడు విజయ్‌కుమార్

**ప్రజాశక్తి - భీమవరం**

ప్రజా సంకల్ప యాత్రలో 104 ఎంఎంయు వాహన ఉద్యోగులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఎంఎంయు జిల్లా కమిటీ నూతన అధ్యక్షులు విజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షునిగా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షునిగా సతీష్, కార్యదర్శిగా సురేష్, సహాయ కార్యదర్శిగా సుదర్శన్, కోశాధికారిగా గౌరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 104 వాహనాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్షనేతగా ప్రజా సంకల్ప యాత్రలో వైసిపి అధికారంలోకి రాగానే 104 ఎంఎంయు వాహనాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని, వేతనాలు పెంచుతానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకొచ్చి సంవత్సరాలు నాలుగేళ్లవుతున్నా ఇప్పటి వరకూ హామీలేవీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఉద్యోగ భద్రత, వేతన పెంపు కోసం పోరాటాలు సాగిస్తామని విజయకుమార్ తెలిపారు.




నూతనంగా ఎన్నికైన కమిటీ

# చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

**ఉంగుటూరు:** స్వాతంత్ర్య సమరయోధురాలు, రజక సామాజిక మహిళ చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని గొల్లగూడెంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జొన్నాడ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఐలమ్మ విగ్రహాన్ని రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ సుగమంచి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ దోబీ మహాసంఘ్ జాతీయ ఉపాధ్యక్షులు చింతాడ శ్రీనివాస్, అఖిల భారత ధోబి మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు జిల్లెల శ్రీరాములు, రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కాకినాడ రామారావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు రేవూరి గోగురాజు, ఈగలపాటి యువశ్రీ, కొండపల్లి దుర్గారావు, రాష్ట్ర నాయకులు అడ్డాల నరసింహారావు, చింతపల్లి గురుప్రసాద్, నడిపూడి నాగబాబు, వెలుదూటి శ్రీనివాస్, నాగపోసి కృష్ణ, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, యండమూరి మహేష్, అంజూరి శ్రీనివాస్, గొల్లగూడెం రజక సంఘం అధ్యక్షులు పల్లంట్ల రాంబాబు, కార్యదర్శి పిప్పర ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రముఖులు



వీరవాసరంలో బహుమతులు అందుకున్న విజేతలు

# ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

**ప్రజాశక్తి - వీరవాసరం**

వేసవి విజ్ఞానం పేరుతో నిర్వహించిన శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో మరిన్ని నైపుణ్యాలను పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా తయారు కావాలని వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు ఆకాంక్షించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్.ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను చైతన్యపరుస్తున్న జెవివిని అభినందించారు. ఈ శిక్షణా శిబిరంలో ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు, ఎస్ఐ రమేష్, గ్రంథపాలకుడు ఎం.హనుమంతరావు, బాజంకి కృష్ణారావు, జివివి.రామానుజరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోకాళ్లపై భూనిర్వాసితుల నిరసన

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ఇళ్ల స్థలాల కోసం నిరుపేదల నుంచి భూములు తీసుకుని వారికి నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య అన్నారు. జగనన్న ఇళ్ల స్థలాల కోసం భూములు తీసుకుని నష్టపరిహారం చెల్లించకపోవడంతో సంబంధిత రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారం ఐదో రోజుకు చేరింది. బాధితులంతా మోకాళ్లపై కూర్చుని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు సిపిఎం మండల నాయకులు మద్దతు తెలిపారు. నిరుపేద రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత రైతులు సంబలదీవి సాయి, కారింకి సత్యనారాయణ, నల్లి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న బాధితులు


గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

## సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యత : జెడ్‌పి ఛైర్మన్

**ప్రజాశక్తి - పాలకొల్లు**


రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యతిస్తోందని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని 9వ వార్డులో ఆదివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, మున్సిపల్ ఇంజినీర్ సాంబశివుడు, ఎఇ సతీష్, టిపిఎస్ వీరబ్రహ్మం, టిపిఐ త్రినాథరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.


ముత్యాలమ్మ ఆలయంలో జనం

## ముత్యాలమ్మ ఆలయం కిటకిట

**ప్రజాశక్తి - మొగల్తూరు**

ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.


వృద్ధులకు పండ్లు అందజేస్తున్న స్వర్ణలత

## వృద్ధులకు పండ్లు అందజేత

**ప్రజాశక్తి - మొగల్తూరు**

పాతపాడు పంచాయతీ పరిధి కంత గ్రామంలో శ్రీదేవి వృద్ధాశ్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మేడిది స్వర్ణలత మదర్స్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లి, విశ్రాంత ఉపాధ్యాయురాలు మదర్ మేరీరత్నం జ్ఞాపకార్థం వృద్ధులకు పండ్లు, పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు, జ్యూస్‌లు అందజేశారు.

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు స్థానిక వాసవీ డిగ్రీ కళాశాల మాజీ ప్రెసిడెంట్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి లయన్ ఎన్‌వి.రమణారావు మాట్లాడుతూ మన జీవితంలో అమ్మ పాత్రే అత్యున్నతమైందన్నారు. ప్రతి గొప్ప వ్యకి విజయం వెనుకా అతని తల్లి స్ఫూర్తి ఉంటుందన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా వివిధ క్లబ్ సభ్యుల మాతృమూర్తులను గౌరవించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం క్లబ్ మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు డి.సుశీల, డాక్టర్ కమల, లియో మాధురి, సంపత్, కొప్పిశెట్టి రమణయ్య పాల్గొన్నారు.



తల్లులను సత్కరించిన క్లబ్ సభ్యులు

## నేడు, రేపు చదరంగంలో శిక్షణ


**ప్రజాశక్తి - వీరవాసరం**

ఈ నెల 15, 16వ తేదీలో వీరవాసరం గ్రంథాలయం వద్ద చదరంగంలో శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రంథాల అభివృద్ధి కమిటీ సభ్యులు సబ్బారపు వెంకట్రావు ఆదివారం తెలిపారు. వేసవి వినోదం కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని భీమవరం చదరంగం కోచ్ ఐ.సత్యనారాయణ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు గ్రంథాలయం వద్ద సంప్రదించాలన్నారు.

## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ప్రతి విద్యార్థీ బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు అంత్యం సూర్యప్రకాశరావు అన్నారు. పదో తరగతి పరీక్షల్లో 581 మార్కులు సాధించిన కూర్మాల సుబ్బలక్ష్మి సుదీప్తిని శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం సభ్యులు ఆదివారం మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని, గ్రామానికి, కుటుంబానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, యానాది శెట్టి, గ్రంధి రాజా, కూర్మాల కాశీ, పూర్ణారావు, నారాయణరావు, రాజా నరసింహారావు, కుసుమగుప్త, నాగరాజు, గంగరాజు పాల్గొన్నారు.


విద్యార్థినిని సత్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# శిథిలావస్థలో వంతెన..!


### పట్టించుకోని పాలకులు, అధికారులు
### ప్రజల అవస్థలు

**ప్రజాశక్తి - ఉండి**


శిథిలావస్థకు చేరి ఒరిగిపోయిన వంతెన

ఉండి ఆంధ్రా బ్యాంకు సమీపంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో కాలువపై బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన వంతెన నేడు శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రయాణికులు అటు వైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. అయినా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులుగానీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనపై నుంచి కేవలం ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లాలన్నా, కొత్తపేట, నిమ్మలపేట, కలింగపేట తదితర ప్రాంతాలకు వెళ్లాలన్న ఈ వంతెనే శరణ్యం. అయితే వంతెన శిథిలావస్థకు చేరడంతో ఇంటి నిర్మాణానికి సంబంధించి సామగ్రిని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని నిర్మాణదారులు వాపోతున్నారు. వంతెన చాలా వరకు దెబ్బతిని కొంతమేర ఒరిగిపోయిందని, రాత్రి సమయంలో ప్రయాణించేవారు ఆదమరిస్తే కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. స్థానికులు ఒరిగిపోయిన చోట పెద్ద దిమ్మను అడ్డంగా పెట్టడంతో ప్రమాదాన్ని తాత్కాలికంగా నివారించగలిగారు. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం గానీ ప్రజా ప్రతినిధులు గానీ వంతన నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

**ఒక వైపు ఒరిగిపోయింది..**


**కునుకు శ్రీనివాస్**

ఈ వంతెన అవతల వైపు సుమారు 7000 మంది నివసిస్తున్నారు. వారందరికీ ఈ వంతెనే ఆధారం. రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించే సమయంలో భారీ వాహనాలు ఈ వంతెన పైనుంచి రాకపోకలు సాగించడం వల్ల వంతెన మరింత ఒరిగిపోయింది. ఈ వంతెనకు మరమ్మతులు చేయించాలి. లేదా పునర్నిర్మించాలి.

**ఇబ్బందులు పడుతున్నాం..**


**జంపా నాగేశ్వరరావు, ఉండి**

వంతెన పరిస్థితి అగమ్యగోచరంగా తయా రవ్వడంతో కొత్తపేట, నిమ్మల పేట, కళింగపేట తదితర ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ వంతెన స్థానంలో కొత్త వెంతన నిర్మించాలి.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, డిఎస్‌పి బి.శ్రీనాథ్ ఆదేశాలపై భీమవరం వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీను, సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు ప్రజాశాంతికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సత్ ప్రవర్తనతో ఉంటే వారిపై రౌడీ షీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. రౌడీషీటర్లు వారు ఏయే వృత్తులు నిర్వహిస్తున్నారనే విషయాలపై పోలీసు అధికారులు అడిగి తెలుసుకున్నారు..


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ అడబాల శ్రీను హెచ్చరిక

## పలుచోట్ల హనుమాన్ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ఎల్‌విఎన్.పురంలో 21 అడుగుల అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావం ఉన్నప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వేంద్ర వెంకటస్వామి, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తోకతిప్ప గ్రామంలో జరుగుతున్న గవర్లమ్మ జాతర ఉత్సవాల్లో ఎంఎల్ఎ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


పాలకొల్లులో యాత్రికులతో కిటకిటలాడుతున్న ఆలయం

**పాలకొల్లు:** హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాలు యాత్రికులతో కిక్కిరిశాయి. యడ్ల బజారులోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి సామూహిక సహస్రనామార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కొత్తపేట, రైల్వే గేటు వద్ద ఉన్న ఆలయాల వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు.


**పాలకొల్లు రూరల్ :** ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా దిగమర్రు, సగంచెరువు, శివదేవునిచిక్కాల, దగ్గులూరు తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాలు కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలన్నీ హనుమాన్ నామస్మరణతో మారు మ్రోగాయి.

**ఉండి:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. చెరుకువాడలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉండి బాలాజీరావు పేటలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో బుర్రకథ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యాత్రికులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు.

## 'తల్లిదండ్రులను గౌరవించాలి'

**ప్రజాశక్తి - నరసాపురంటౌన్**

పిల్లలు తల్లిదండ్రులను ప్రేమించి గౌరవించాలని శాస్త్రవేత్త ఆర్‌వి.సుబ్బారావు అన్నారు. స్థానికప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా ఆయన పిల్లలకు అమ్మ గురించి వివరించారు. ఓర్పుకు, త్యాగానికి ప్రతిరూపమైన తల్లి ప్రేమ గురించి వివరించారు. మదర్ థెరిస్సా సేవలను కొనియాడారు. పిల్లలచే తొలుత పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. అనంతరం జెల్లీ శ్రీనివాస్ పిల్లలకు యోగాసనాలు వివరించారు. విజయలక్ష్మి కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సాంబమూర్తి పిల్లలకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలీ, అందే రంగారావు, ప్రవీణ్, జీవన్‌కుమార్, సూర్యంబాబు, సుధీర్, మోహన్, తోట శ్రీనివాస్, లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి పాల్గొన్నారు.


విద్యార్థులతో గ్రంథాలయ సభ్యులు



మాట్లాడుతున్న స్కూల్ యాజమాన్యం

## 16 నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

**ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్**

ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ క్యాంపస్‌లో ఈ నెల 16, 17, 18, 19 తేదీల్లో రాష్ట్రస్థాయి కవురు శ్రీనివాస్ కప్ బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలేజీ యాజమాన్యం తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఇందులో 400 మంది బాలురు, బాలికలతో 26 జట్లు పాల్గొంటారు. హోరా హోరీగా సాగే ఈ బాస్కెట్ బాల్‌పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు, పరిసర ప్రాంత ప్రజలు విచ్చేయాలని మాంటిస్సోరీ విద్యాసంస్థలు, సబిత ఉమెన్స్ జూనియర్ కాలేజీ వారు కోరారు.


మూత పడిన కాళ్లకూరు పంచాయతీ ఆర్‌ఓ ప్లాంట్


వేరే చోట నుంచి నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

# మూతపడిన కాళ్లకూరు ఆర్‌ఓ ప్లాంట్

### పసర్లుగా వస్తున్న కుళాయి నీరు - తాగునీటికి గ్రామస్తుల అవస్థలు

**ప్రజాశక్తి - కాళ్ల**

కాళ్లకూరు మేజర్ పంచాయతీలోని ఆర్‌ఓ ప్లాంట్ మూసి వేయడంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వా సాగు గణనీయంగా పెరగడంతో పంట కాలువలు కలుషితమై ఆ నీటిని తాగలేని పరిస్థితి నెలకొంది. కాళ్లకూరులో 6 వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామస్తులకు స్వచ్ఛమైన నీరందించేందుకు 2008లో కాళ్లకూరు పాల ఉత్పత్తిదారులు, సత్య సేవా వారి ఆర్థిక సహకారంతో చిన్న షెడ్డు ఏర్పాటు చేసి ఆ మేరకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీన్ని అప్పటి సర్పంచి గంటా ఆనందరావు ప్రారంభించారు. గ్రామంలో ఆరు తాగునీటి చెరువులు ఉన్నాయి. అయితే రొయ్యల సాగు పెరగడంతో పంట కాలువలు కలుషితమయ్యాయి. ఆ నీటిని తాగునీటి చెరువుల్లోకి నింపడంతో రంగు మారిపోతున్నాయి. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. కనీసం భారమైనా మినరల్ వాటర్ తెచ్చుకుందామంటే అదికాస్త మూతపడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2014లో చిన్నగా ఉన్న షెడ్డును రీ మోడలింగ్ చేసి రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆర్‌ఓ ప్లాంట్ స్థాయిని పెంచారు. దీన్ని అప్పటి ఎంపి గోకరాజు గంగరాజు ప్రారంభించారు. అప్పటి నుంచి ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను గ్రామ సర్పంచి అడ్డాల శివరామరాజు తీసుకున్నారు. ఆయన పదవీ కాలం వరకూ ప్లాంట్‌ను సక్రమంగా నిర్వహించారు. ఆ తర్వాత గ్రామంలో కొంతమంది దాతల సహకారంతో ప్లాంట్ నిర్వహణ సాగింది. క్రమేపి ప్లాంట్ నిర్వహణ భారం కావడంతో మూత పడింది.

**9 నెలల నుంచి ప్లాంట్ మూత...**

ప్లాంట్ మూతపడి 9 నెలలు కావస్తోంది. దీంతో అందులోని సామగ్రి తుప్పుపట్టి దెబ్బతింటోంది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇతర గ్రామాలకు వెళ్లి ప్రయివేటు ఆర్‌ఓ ప్లాంట్ నీటిని కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆర్‌ఓ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**కుళాయిల ద్వారా తాగునీరందిస్తున్నాం..**

**బి.సతీష్ కుమార్, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, కాళ్లకూరు**

ఆలం ప్లాంట్ ద్వారా నీటిని శుద్ధి చేసి తాగునీటిని కుళాయిల ద్వారా అందిస్తున్నాం. గతంలో రాజు వేగేశ్న ఫౌండేషన్ వాటర్ ప్లాంట్‌ను పంచాయతీ ద్వారా నిర్వహించేవారు. వాటర్ ప్లాంట్ నిర్వహణ కష్టమవ్వడంతో మూతపడింది. ఆ ప్లాంట్ నిర్వహించేలా తదుపరి చర్యలు తీసుకుంటాం.

## యువగళానికి మద్దతుగా నేడు పాదయాత్ర

**ప్రజాశక్తి - ఉండి**

యువగళానికి మద్దతుగా ఉండిలో నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకోవడంతో నారా లోకేష్‌కు మద్దతుగా మండలంలోని చెరుకువాడలో అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ఉండి మెయిన్ సెంటర్ వరకూ సోమవారం సాయంత్రం ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రలో తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

**పాలకొల్లు :** నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర సోమవారానికి వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 15న నియోజకవర్గంలో కార్యకర్తలు, అభిమానులతో పాదయాత్ర నిర్వహించనున్నారు. గాంధీ బొమ్మల సెంటర్ నుంచి పాలకొల్లు పట్టణంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు టిడిపి అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**పెనుమంట్ర :** నారా లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో సంఘీభావంగా ఈ నెల 15న మార్టేరు సెంటర్ నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లాలు) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మార్టేరు కనకదుర్గమ్మ దేవాలయం (జగన్నాథపురం చెక్‌పోస్టు) నుండి ప్రారంభమై మార్టేరు మీదుగా పెనుగొండ మండలం చెరుకువాడ వరకు పాదయాత్ర సాగుతుందని పేర్కొన్నారు.

## నేటి నుంచి బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్లు

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సోమవారం నుండి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది పూరిళ్ల శ్రీనివాస్, ఎన్నికల కమిటీ సభ్యులుఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి, లైబ్రరీ కార్యదర్శి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి, కోశాధికారి, మహిళా ప్రతినిధితోపాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యుల పదవుల కోసం పోటీ చేసేవారి నుండి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 16వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించి 17న పరిశీలిస్తామని తెలిపారు. అదే రోజు అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తామని వివరించారు. ఎన్నికలు ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తామని వారు తెలిపారు.

ప్రకటన

శ్రీయుత గౌరవనీయులైన ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, కొత్తగూడెం వారి ఆదేశానుసారం

H.M.O.P. No. 217/2022

Between:
చిట్టిమోద్దుల హరిష్ -పిటీషనర్
AND
చిట్టిమోద్దుల ప్రశాంతి @ తోకల ప్రశాంతి -రెస్పాండెంట్

పైన పేర్కొనబడిన H.M.O.P. No. 217/2022 లో పిటిషనర్ అయిన చిట్టిమోద్దుల హరిష్ యొక్క భార్య చిట్టిమోద్దుల ప్రశాంతి @ తోకల ప్రశాంతిని ది. 10-10-2017 బుధవారము రాత్రి గం॥ 7.00లకు రాజాపురం గ్రామం, అన్నపురెడ్డిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెంలో పెళ్లి చేసుకోవడం జరిగింది. అట్టి పెళ్లికి సంబంధించి పైన తెల్పిన కోర్టు నందు విడాకులు మంజూరు చేయమని మీమీద కేసు వేయడం జరిగింది. అట్టి కోర్టు సమన్లను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకపోవటం వల్ల అట్టి విషయాన్ని ఈ పత్రికా సమూహంగా తెలియపర్చడం అయినది. ఇట్టి కేసు **ది. 09-06-2023న వాయిదా ఉన్నది.** ఆరోజున మీరు ఎక్కడ ఉన్న మీరు లేదా మీ లాయర్ గారి ద్వారా అయిన అట్టి కోర్టుకు హాజరు కావలెను. లేనిచో మా క్లయింట్ చిట్టిమోద్దుల హరిష్‌కి అనుకూలంగా తీర్పు ఇవ్వటం జరుగుతుంది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

**కె.కుమార్,** పిటిషనర్ న్యాయవాది
కొత్తగూడెం, సెల్: 8919404057

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ఏలూరు జిల్లా, ఏలూరు నగరంలోని శాంతినగర్, 7వ రోడ్డు, డోరు నెం. 28-4-72/1రు కాపురస్తురాలు **గ్రంధి రామచంద్ర వరప్రసాద్ గారి కుమార్తె నవ్య W/o. కొత్త సాయి వెంకట ప్రణీత్** అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు గ్రంధి నవ్య ది. 06-05-2023న సాయంకాలం సుమారు 6 గం॥ల సమయంలో తన స్కూటీ వాహనంపై 1) తన పేరున మరియు తనకు వరుసకు సోదరి సమానురాలైన గ్రంధి వెంకటప్ప నరసింహారావు గారి కుమార్తె గ్రంధి స్నేహలతల పేరున జాయింటుగా వార్ల పితామహి శ్రీమతి గ్రంధి వెంకట రత్నమహాలక్ష్మి గారిచే దఖలు చేయబడి ది. 01-02-2017న వ్రాసియిచ్చి ఏలూరు సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు చేసిన రిజిష్టర్డు దఖలు దస్తావేజు నెం. 630/2017 రు దస్తావేజును మరియు 2) నా క్లయింటు తల్లిగారు అయిన గ్రంధి పద్మావతి గారు నా క్లయింటు పేరున వ్రాయించి రిజిస్ట్రీ చేయించి ఇచ్చిన రిజిష్టర్డు సెటిల్‌మెంటు దస్తావేజు నెం. 3899/2022కు అనుసంధాన దస్తావేజు (లింకు డాక్యుమెంటు) అనగా నా క్లయింటు తల్లిగారైన సదరు గ్రంధి పద్మావతి గారి పేరున లేటు చెలికాని వెంకట నరసింహారావు గారి కుమారుడు చెలికాని వెంకటేశ్వరరావు గారు ది. 23-11-2017న వ్రాయించి చింతలపూడి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రీ చేయించి ఇచ్చిన క్రయ దస్తావేజు నెం. 5941/2017రు ఒరిజినల్ దస్తావేజునున్నూ నా క్లయింటు తన స్కూటీ వాహనమునకు గల హుక్కుకు తగిలించిన సంచిలో పెట్టుకుని నా క్లయింటు ఇంటి నుంచి ఏలూరు కొత్త బస్టాండు వైపుగా వెళ్ళుచుండగా దారి మధ్యలో జారి పడిపోయినవి. కావున జారి పడిపోయిన సదరు రెండు దస్తావేజులు అనగా డాక్యుమెంటు నెం. 630/2017రు మరియు 5941/2017 ర్లు ఎవరికైననూ దొరికిన యెడల నా క్లయింటుకు అప్పగించుట గాని లేక నా క్లయింటు తాలూకు **మొబైల్ నెంబర్. 9347570771** రుకు తెలియపరచవలసినదిగా కోరుచున్నారు.

**కోరుకొండ రాజా రామమోహన్**
ఏలూరు అడ్వకేట్, కాంగ్రెస్ ఆఫీసు వీధి,
ది.12-05-2023 అగ్రహారం, ఏలూరు-1